క్లుప్తంగా

కోర్టులో వాటర్ కూలర్ ఏర్పాటు



ప్రారంభిస్తున్న జడ్జి చంద్రశేఖరప్రసాద్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం కోర్టు ప్రాంగణంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సోమవారం ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ప్రిన్సిపల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్యామ్‌శ్రీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

సింగరేణి(కొత్తగూడెం): టేకులపల్లి మండలం చుక్కలబోడు గ్రామ పంచాయతీకి మల్టీపర్పస్ వర్కర్ భూక్యా వెంకటేష్‌కు మెరుగైన వైద్యం అందించాలని గ్రామపంచాయతీ కార్మికుల, ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. బాధ్యులైన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎల్‌ఓసీ అందజేత

టేకులపల్లి: కొత్తతండా గ్రామానికి చెందిన డి.రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో బాధితుడి కుటుంబ సభ్యులు ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.50లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రత్యేక పీఏ ఇస్లావత్ వినోద్ బాధిత కుటుంబానికి రూ.2.50లక్షల ఎల్‌ఓసీని అందజేశారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి



విజేత జట్టుకు కప్ అందజేస్తున్న కొత్వాల

పాల్వంచరూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి చూపాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి నాగారం గ్రామంలో నాగారం ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిసాయి. ఈ మేరకు ముఖ్యఅతిథిగా హాజరైన కొత్వాల బహుమతులను ప్రదానం చేశారు. మాట్లాడుతూ... క్రీడలతో మానసికోల్లాసం, దేహదారుఢ్యం పెంపొందుతాయన్నారు. పట్టుదలతో సాధన చేస్తే అంతర్జాతీయ స్థాయికి ఎదగవచ్చన్నారు. కార్యక్రమంలో బరపటి వాసుదేవరావు, మల్లెల శ్రీరామ్మూర్తి, నిర్వాహకులు పాల్గొన్నారు.

జీపుజాతా

సుజాతనగర్: సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర ఈ నెల 19న సుజాతనగర్ మండలానికి రానున్న నేపథ్యంలో మద్దతుగా సోమవారం జీపుజాతా కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి, సీతంపేట, గరీబ్‌పేట, కోమటపల్లి, రాఘవాపురం, నాయకులగూడెం, దేగలమడుగు, మంగపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. దేశభక్తి పేరుతో గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వం దేశసంపదను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతోందని ఆరోపించారు. ప్రజాపోరు యాత్ర ద్వారా బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఇంటింటికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ, డీజిల్, పెట్రోల్‌పై జీఎస్టీ, గ్యాస్ ధరల పెంపు తదితర అంశాలపై యాత్ర కొనసాగుతుందన్నారు.

అప్‌గ్రేడ్ అయినా సౌకర్యాలు సున్నా

- రోగులకు అందని డయాలసిస్ సేవలు
- ఖమ్మానికి ఉరుకులు పరుగులు
- ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో సదుపాయాలు లేక అవస్థలు



ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల

ఇల్లెందు: ఇక్కడ ప్రభుత్వ ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయింది. కానీ సదుపాయాలు మాత్రం డీ గ్రేడ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం ఆఘమేఘాల మీద అప్‌గ్రేడ్ చేసినా అందుకు తగిన విధంగా సదుపాయాలు కల్పించలేదు. దీంతో ప్రజలకు అరకొర వైద్యం అందుతోంది. ఏడాది కాలంగా డయాలసిస్ సెంటర్ మంజూరైయినా ఉపయోగంలోకి రాలేదు. ప్రతి రోగి ఖమ్మం వెళ్లి డయాలసిస్ చేసుకుంటే వెళ్లిన ప్రతిసారీ రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతోంది. ఇటు వైద్యానికి డబ్బులు ఖర్చు చేయలేక అటు సెంటర్ ఉపయోగంలోకి రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి జనవరి 4, 2022న అప్‌గ్రేడ్ అయింది. కానీ నేటికీ డయాలసిస్ సెంటర్ అందుబాటులోకి రాలేదు. ఆరు నెలల క్రితం డయాలసిస్ సెంటర్‌కు అవసరమైన మిషనరీ, పరికరాలు ఆస్పత్రికి చేరాయి. ఒక గదిని కేటాయించారు. ఆ గదిలో విద్యుత్ వైరింగ్ చేశారు. ఇక ఈ సెంటర్ కోసం ప్రత్యేకంగా ఒక జనరేటర్, సోలార్, బ్యాటరీలతో నడిచేలా ఇన్వర్టర్, వాటర్ ట్యాంక్, బోరు, మోటార్, డ్రైయినేజీ వ్యవస్థ నెలకొల్పాలి. ఒకసారి డయాలసిస్ ప్రారంభమైతే పూర్తయ్యే వరకు మిషనరీ నడుస్తూనే ఉండాలి. మధ్యలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రమాదం. దీనిని అధికమించేందుకు సోలార్‌తో ఇన్వర్టర్ లేదా జనరేటర్ అనుసంధానం ఉండాలి. ఇల్లెందు, టేకులపల్లి, కారేపల్లి, గుండాల, ఆళ్లపల్లి పరిసర ప్రాంతంలో డయాబెటిక్ రోగులు కూడా అత్యధికంగానే ఉన్నారు. వీరంతా నిత్యం ఖమ్మం వెళ్లి డయాలసిస్ చేయించుకుని వస్తున్నారు. ఖమ్మంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకుంటే రూ. 10 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతోంది. వీరికి నెలకు రూ. 2 వేలు పింఛన్ అందుతుంది.

ఖర్చు పెరిగింది..



ఏడాది నుంచి ప్రతీ నెల రూ.30 వేల వరకు డయాలసిస్ కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. పింఛన్ రూ.2 వేలు వస్తోంది. దీనివల్ల ఆర్థిక భారం పెరిగిపోతోంది. అప్పు చేయాల్సిన పరిస్థితి. ఇల్లెందులో డయాలసిస్ సెంటర్ మంజూరు చేశారని తెలిసి సంతోషపడ్డాము. నెలలు గడిచినా దానిని ప్రారంభిచ లేదు. ఖమ్మానికి వెళ్లి రావటం ఇబ్బందిగా ఉంది.

– కటకం దయాకర్‌రావు, పాత ఇల్లెందు, పేషెంట్

వారంలో ప్రారంభిస్తాం..



ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు మంజూరైన డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు పలురకాల కారణాలు ఆటంకంగా మారాయి. అనుమతులు రావాల్సి ఉంది. ఒకటి రెండు రోజుల్లో అనుమతి లభిస్తుంది. టెక్నీషియన్ అందుబాటులోకి వస్తారు. వారం పది రోజుల్లో డయాలసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తాము. ఇతర సమస్యలు కూడా పరిష్కారం అవుతాయి.

– డాక్టర్ రవిబాబు, డీసీహెచ్ఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

నిర్మాణ కార్మికులకు ఉద్యోగాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచ: కేటీపీఎస్ 6వ దశ కర్మాగారంలో ప్రాణాలు తెగించి పనిచేసిన నిర్మాణ కార్మికులకు ఉద్యోగాలు కల్పించాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, తెలంగాణ జన సమితి నాయకులు గోపగాని శంకర్‌రావు అన్నారు. సోమవారం 7వ దశ గేటు వద్ద 6వ దశ నిర్మాణ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 23వేల మందిని ప్రభుత్వం ఆర్టిజన్లుగా విద్యుత్ సంస్థల్లోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరిలో అర్హులైన వారు ఇంకా మిగిలి ఉన్నారని, ఇందులో 6వ దశ నిర్మాణ కార్మికులు ప్రాధాన్యం కల్పించాలన్నారు. వీరికి గతంలో యాజమాన్యం హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. వీరి న్యాయమైన పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు వన్నాపురం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రవూఫ్, కాంగ్రెస్ నాయకులు బద్ది కిశోర్, బత్తుల వెంకటేశ్వర్లు, టీజేఎస్ నాయకులు ఎస్‌కే.నబీ, బి.దేవదానం పాల్గొన్నారు. దీక్షల్లో అల్లిరాము, నీరుడు కుమార్, భూక్యా జూలియా, షేక్.రఫీ, బండి వీరకిరణ్, సోములపల్లి రవికిరణ్ తదితరులు కూర్చున్నారు.

భూనిర్వాసితుల కేసులు పరిష్కరించండి



ఆందోళన చేస్తున్న భూనిర్వాసితులు

సింగరేణి(కొత్తగూడెం): హైకోర్టులో ఉన్న భూనిర్వాసితుల కేసులు పరిష్కరించి తమకు న్యాయం చేయాలని భూనిర్వాసితులు సింగరేణి ఎస్టేట్స్, పర్సనల్ విభాగం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం సుమారు 130 కుటుంబాలకు చెందిన పలువురు ఆందోళన నిర్వహించారు. భూనిర్వాసితులు మాట్లాడుతూ.. మణుగూరు, ఇల్లెందు, ధారపాడు, బెల్లంపెల్లి ఏరియాలలోని 532 భూనిర్వాసిత కుటుంబాలలో 400 మందికి ఉద్యోగాలిచ్చిన సింగరేణి.. 132 మందిని వదిలేసిందని, దీనిపై తాము హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. కేసు ఫైనల్‌కు వచ్చి జడ్జిమెంట్ తమకు అనుకూలంగా ఉన్న విషయం తెలిసిన సింగరేణికి చెందిన న్యాయవాదులు తమకు సహకరించడం లేదన్నారు. ఈ కారణంగా ఆరు నెలల నుంచి కేసు జడ్జిమెంట్‌కు రావటం లేదన్నారు. సింగరేణి లా విభాగం అధికారులు భూ నిర్వాసితులకు సహకరించాలని కోరారు. భూనిర్వాసితులు మాలోత్ దిలీప్‌కుమార్, భూక్యా హరి, పవన్, కరుణాకర్, జార అరుణ, ఈశ్వరి, అనిత పాల్గొన్నారు.

స్వచ్ఛ పల్లెల బాధ్యత కార్యదర్శులదే..



మాట్లాడుతున్న దమ్మపేట ఎంపీఓ కుమార్

ఇల్లెందురూరల్: పల్లెలను స్వచ్ఛతకు నిలయంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గ్రామపంచాయతీ కార్యదర్శులపై ఉందని దమ్మపేట, ఇల్లెందు, గుండాల ఎంపీఓలు డీవీ కుమార్, చిరంజీవి, వలి హజరత్ అన్నారు. మండలంలోని రేపల్లెవాడ గ్రామపంచాయతీ రైతువేదికలో స్వచ్ఛ భారత్ మిషన్–2లో భాగంగా సర్పంచ్‌లు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని సోమవారం వారు ప్రారంభించారు. మాట్లాడుతూ.. పల్లెల్లో స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించిందని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకుంటూ క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. అంతేకాకుండా స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఇప్పటి వరకు నిర్మించిన మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర నిర్మాణాల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. ప్రతిఒక్కరూ వాటిని వినియోగించుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వీధులలో మురుగు నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా ఒక గ్రామపంచాయతీని ఎంపిక చేసి సర్వే నిర్వహించడంతోపాటు గ్రామ సమగ్ర నమూనా చిత్రపటం సిద్ధం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

28 నుంచి క్రికెట్ పోటీలు

సుజాతనగర్: ఈ నెల 28 నుంచి మే 4వ తేదీ వరకు కాసాని లక్ష్మి మెమోరియల్ మండల స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకుడు వీర్ల రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేత జట్టుకు రూ.10,116, రెండవ రూ.5,116, కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరగనున్న ఈ పోటీలకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు 8978735852 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆలయానికి విరాళం

పాల్వంచరూరల్: కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి అమ్మవారి భక్తులైన పాల్వంచ పట్టణంలోని గట్టాయిగూడెంకు చెందిన తాటికొండ అప్పారావు, రమణ దంపతలు రూ.5116 విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి సోమవారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

టేకులపల్లి: ఇల్లెందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు టేకులపల్లి మండలం ఎర్రాయిగూడెం గ్రామంలో సోమవారం పర్యటించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తుల ఆహ్వానం మేరకు నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ గుడి స్థలాన్ని పరిశీలించారు. గుడి నిర్మాణానికి రూ.10,116 విరాళం అందించారు. కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు టి.సామ్రాట్, టేకులపల్లి మండల అధ్యక్షుడు భూక్య దేవా నాయక్, చీమల రత్నం, ఊకె బుచ్చయ్య, చీమల సత్యం, నరసింహారావు, చీమల రామస్వామి, కొటెం స్వరూప పాల్గొన్నారు.

ఆదివాసీ కాంగ్రెస్ కార్యదర్శిగా పాపారావు



ఇల్లెందు: ఇల్లెందుకు చెందిన ఆదివాసీ నాయకుడు, అడ్వకేట్ ఆరెం పాపారావుకు ఆదివాసీ కాంగ్రెస్‌లో రాష్ట్ర కార్యదర్శి పదవి లభించింది. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ కార్యదర్శిగా తనను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌లాల్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావాటానికి తన వంతు కృషి చేస్తానని, ఆదివాసీ, గిరిజనులను చైతన్యం చేసి కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తానని తెలిపారు. తనకు పదవి రావటానికి కృషి చేసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, సీతక్క, భట్టి విక్రమార్క, బలరాం నాయక్, రేణుకాచౌదరి, దామోదర్‌రెడ్డి, భరత్‌చంద్రారెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు

సుజాతనగర్: ఆర్ఎంపీ వైద్యులు నిబంధనలు పాటించాలని ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మణికంఠరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన ఓ నలుగురు ఆర్ఎంపీ వైద్యులు అర్హత లేకున్నా చికిత్స చేయడమే కాకుండా, అధిక డోసులు వేస్తూ గిరిజన ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని బానోత్ వేణుగోపాల్ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో గ్రామంలోని పలు ఆర్ఎంపీ క్లీనిక్‌లను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల మేరకే ఆర్ఎంపీ వైద్యులు పనిచేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆపరేషన్లు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎంహెచ్ఓ ఆదేశానుసారం తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా మాస్ మీడియా అధికారి ఫయాజ్ మొయిద్దీన్, డిప్యూటీ డీఈఎంఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వం ద్వంద్వ నీతిని విడనాడాలి



ఇల్లెందురూరల్: దీక్షలో కూర్చున్న వీఓఏలు



పాల్వంచరూరల్: తహసీల్ ఎదుట..



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న పద్మ

వీఓఏల సమ్మె ప్రారంభం

ఇల్లెందురూరల్: ఒకే శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిలో ఒకరికి వేతనాలు పెంచి మరొకరిని విస్మరించిన ప్రభుత్వ ద్వంద్వ నీతిని వీడాలని సీఐటీయూ జిల్లా నాయకులు నబి, తాళ్లూరి కృష్ణ డిమాండ్ చేశారు. తమ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం సెర్ప్ కార్యాలయం ఎదుట వీఓఏలు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. మాట్లాడుతూ.. పొదుపు సంఘాల ఆవిర్భావం నుంచి చిరుద్యోగులుగా చేరి ఉచిత సేవలతో సుదీర్ఘకాలం విధులు నిర్వహిస్తున్న వీఓఏలకు సమ్మె ప్రభావంతో అరకొర వేతనాలు ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. తమ వేతనాలు పెంచాలని, పేస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెర్ప్‌లో సీసీ మొదలు ఉన్నతాధికారులకు వరకు సమ్మె చేసి తమ డిమాండ్లను సాధించుకున్నారని గుర్తుచేశారు. వీఓఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. నవ్య, పాపారావు, మోతీలాల్, వసంతరావు, నీలాబాయి, ప్రమీల, సుల్తానా, పృథ్వీ పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ (వీఓఏ)లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని, సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వీఓఏలు రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా కొత్తగూడెం జిల్లా కేంద్రంలో వీఓఏల నిరవధిక దీక్ష శిబిరాన్ని పద్మ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీరన్న, రేష్మ, మాధవి, స్వరూప, మునీస, సత్యవతి, అరుణ, రాజమణి, పద్మ, సంధ్య, సఫియా, జహీదా, రజిత, పద్మ, అరుణ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ వీఓఏల శ్రమను దోచుకుంటోందని సీఐటీయూ నాయకుడు సాంబశివరావు అన్నారు. స్థానిక తహసీల్ ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఐకేపీ వీఓఏలు రిలే నిరహార దీక్షలు చేపట్టారు. శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. జి.పద్మ, వినోద, కె.సత్య, వి.అనురాధ, ఎస్.రమేష్, రమాదేవి, ఉమ, కృష్ణవేణి, సుజాత పాల్గొన్నారు.

రంజాన్ తోఫా అందజేత



తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో రెండువేల మంది ముస్లింకు సోమవారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, రంజాన్ తోఫాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమన్నారు. సుమారు 50 మసీదులకు రూ.4.00 లక్షలు అభివృద్ధి పనులకు అందజేసినట్లు తెలిపారు. కొత్తగూడెంలో ఉర్దూఘర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయించడం జరిగిందని, త్వరలోనే రామాంజనేయ కాలనీ పక్కన, పాత కొత్తగూడెంలో ముస్లింలకు ఖబరిస్తాన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంపీపీ బాదావత్ శాంతి, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఉర్దూగర్ కమిటీ చైర్మన్ అన్వర్ పాషా, రజాక్, తహసీల్దారు శర్మ పాల్గొన్నారు.

మోదీ సారథ్యంలోనే దేశంలో సుపరిపాలన



మాట్లాడుతున్న రంగాకిరణ్

చుంచుపల్లి: జిల్లాలో బీజేపీ మోర్చా చేపట్టిన పల్లెపల్లెకు ఓబీసీ.. గడపగడపకు బీజేపీ కార్యక్రమం కార్యకర్తల్లో కొత్త జోష్ నింపిందని కార్యక్రమ జిల్లా కోఆర్డినేటర్, ఓబీసీ జాతీయ మీడియా సెల్ కోఆర్డినేటర్ కేవీ రంగాకిరణ్ అన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావుతో కలిసి ఆయన సోమవారం చుంచుపల్లి శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ–ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపు మేరకు ఈ నెల 6 నుంచి 14 వరకు అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో తొమ్మిదేళ్లుగా సుపరిపాలనను అందిస్తూ దేశ ప్రజల మన్నన పొందుతున్నారని చెప్పారు. ముఖ్యంగా దేశంలో నూటికి 70 శాతం జనాభా ఉన్న ఓబీసీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం బీసీలను అన్ని రంగాల్లో అణచివేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర జరుగుతోందని, రూ.కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు రు. ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు గంధం నాగేంద్రప్రసాద్, జిల్లా కోశాధికారి జల్లారపు శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చింతలచెర్వు శ్రీనివాసరావు, మోహనరావు పాల్గొన్నారు.

ప్రైవేట్‌లోనూ రిజర్వేషన్లు కల్పించాలి

పాల్వంచ: దేశంలోని పరిశ్రమలను ప్రైవేట్‌కు కట్టబెట్టవద్దని, ప్రైవేట్‌లోనూ రిజర్వేషన్లు కల్పించాలని బహుజన ఐక్యవేదిక కన్వీనర్ బరగడి దేవదానం అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దేశంలో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు భారత రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ఇది కేవలం ప్రభుత్వ సంస్థల్లోనే అమలులో ఉందని, దీనివల్ల కొంత వరకు అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఇదే రీతిలో ప్రైవేట్‌లోనూ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సీహెచ్.ముసలయ్య, ఎస్‌కె.నబీసాహెబ్, శ్రీపాద సత్యనారాయణ, ఎస్‌డీటీ హుస్సేన్, ఎస్ఏ.రహీమాన్, ఎండీ.మంజూరు, సలీం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



జీఎం షాలేమురాజుకు కమిటీ వివరాలు అందజేస్తున్న సభ్యులు

ఇల్లెందు: కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ తెలిపారు. సోమవారం జీఎం ఆఫీస్ పిట్ సెక్రెటరీగా గుగ్గిల యాదగిరి, అసిస్టెంట్ సెక్రెటరీగా మోయినుద్దీన్, అసిస్టెంట్ బ్రాంచీ సెక్రెటరీగా అనిల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వేణు, మహిళా ప్రతినిధిగా రజినీని నియమించినట్లు తెలిపారు. జీఎం కార్యాలయ పరిధిలో ఉండే ఉద్యోగులు, కార్మికులు తమ యూనియన్‌ను సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం షాలేమురాజును నూతనంగా ఎన్నికైన జీఎం కార్యాలయం కమిటీని పరిచయం చేసి సభ్యుల వివరాలు అందజేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నేతలు కళ్లం కోటిరెడ్డి, జే.వెంకటేశ్వర్లు, సంజీవచారీ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి



ఇల్లెందురూరల్: నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు



టేకులపల్లి ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్యదర్శులు

టేకులపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శి (జేపీఎస్)ల ప్రొబేషనరీ పిరియడ్ ఈనెల 11తో పూర్తయినప్పటికీ రెగ్యులర్ చేయడం లేదని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ పంచాయత్ సెక్రటరీస్ ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మె చేసేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా సోమవారం నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి సమ్మె నోటీసు అందజేశారు. నాయకులు, కార్యదర్శులు మాట్లాడుతూ.. జేపీఎస్‌లను రెగ్యులర్ చేస్తూ వెంటనే జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంగారు సందీప్‌కుమార్, శిరీష, వరుణ్‌తేజ, దీప్తి, శరత్‌చంద్ర, దుర్గాభవానీ, రాజు, సౌజన్య, కిరణ్‌కుమార్, మీనాకుమారి, మంగీలాల్, రజిత పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తమ విధులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణం స్పందించి తమ డిమాండ్‌ను పరిష్కరించాలని కోరారు.

బీసీ కులగణన చేపట్టాలి

పాల్వంచ: దేశంలో బీసీల కులగణన చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో బీసీల కులగణన చేపట్టాలని సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ.. కులగణన చేపట్టకుండా బీసీలకు నిర్లక్ష్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపీ బీసీల వ్యతిరేకి అని నిరూపించుకుంటోందని విమర్శించారు. బండి సంజయ్ అనేక సార్లు ఢిల్లీకి వెళ్లారని, ఒక్కసారైనా బీసీ కులగణనపై మాట్లాడారా అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు బీసీల మీద ప్రేమ ఉంటే నిరసన దీక్షలు చేసి కులగణనకు డిమాండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, కోలా మల్లిక, కేతిని కుమారి, రాణి, రాజేశ్వరి, మర్తమ్మ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డు మీదకు షాపులు.. రోడ్డుపై వాహనాలు



ఇల్లెందు మండలంలోని సుభాష్‌నగర్ కూడలి ఖమ్మం, కొత్తగూడెం మార్గలకు ప్రధాన కేంద్రం. ఇక్కడ మురుగుకాల్వ దాటి రోడ్డుకు మీదకు వచ్చి వ్యాపారాలు కొనసాగడం, ప్రయాణికుల కోసం ప్రైవేటు వాహనాలు బీటీ రోడ్డుపై నిలిపివేయడంతో ఎప్పుడూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. అటుగా వచ్చే పెద్ద వాహనాలు కొద్దిసేపు నిలిపి ఉంచాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్సులు కూడా స్టాప్‌కు దూరంగా నిలుపుకోవాల్సి వస్తోంది. పోలీసు అధికారులు స్పందించి ట్రాఫిక్ రద్దీ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– ఇల్లెందురూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : రాజు, సీఐ, ఇల్లెందు
సెల్ నంబర్ : 8712682069